01ATP14_01ATP14.qxd 14-11-2026 PM 10:45 Page 1





అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 15 నవంబర్ 2026 పేజీలు : 04

అంతుపట్టని జెసి రాజకీయం వ్యూహం

- సర్పంచు పదవులు విద్యావంతులకే అంటూ పర్యటనలు
- జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కూటమికే ఎక్కువ స్థానాలు





రావి రాజేంద్రప్రసాద్
తాడిపత్రి జెడ్పిటిసి సభ్యులు



కదిరి శ్రీకాంత్ రెడ్డి(జనసేన)
పెద్దపప్పూరు జడ్పిటిసి



వేలూరు రంగయ్య
యాడికి జెడ్పిటిసి సభ్యుడు

అనంతపురం, నవంబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

తాడిపత్రిమాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి గ్రామ పంచాయితీలకు త్వరలో జరగబోయే ఎన్నికల్లో సర్పంచు పదవులను విద్యావంతులకే ఇవ్వాలి, విద్యావంతులు పదవుల్లో ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నాడు. సోమవారం నుండి తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటనకు దిగుతున్నట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. విద్యావంతులకే సర్పంచు పదవులు అనే నినాదం ఎందుకు తీసుకున్నాడు.. దీని వ్యూహం ఏమిటి అన్నది అంతుపట్టడం లేదు. విద్యావంతులు పదవుల్లో ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే నినాదం ఎందుకు తీసుకున్నాడు.. ఆ నినాదం అమలయ్యేందుకు ఆయా గ్రామాల్లో ఎక్కువ చదువుకున్న వారికి పదవి ఇవ్వబోతున్నారా లేదా అన్నది వేచిచూడాల్సిందే. ఇప్పటి వరకు గ్రామాల్లో ఇటు తెలుగుదేశమైనా, అటు వైసిపి అయినా గ్రామ పెద్దలు గతంలో వివిధ పదవులు అనుభవించిన వారు, ఆయాగ్రామాల్లో నాయకులుగా చలామని అయ్యేవారే సర్పంచు పదవులను చేజిక్కించుకుంటున్నారు. ఇప్పుడు విద్యావంతులకే సర్పంచు పదవులు అన్న నినాదంతో మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి ముందుకెళ్తున్న నేపథ్యంలో తాడిపత్రి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో స్పందన ఏ విధంగా ఉంటుందన్నది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పంచాయితీ ఎన్నికలు అనేటివి రాజకీయాలకు అతీతంగా జరుగుతున్నాయి. అయితే పలు నియోజకవర్గాల్లో ఆయా గ్రామ పంచాయితీల నుంచి తామే బరిలోకి దిగుతామని ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు, ఆయా మండలాల నాయకుల ఇళ్ల వద్దకు వచ్చి వెళ్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో టిడిపి వారే కైవసం చేసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి ఎన్నికల్లో ఉత్సాహంగా ముందుకు రాలేదు. తాడిపత్రి నియోజకవర్గంలోని అన్ని మండలాల జడ్పిటిసిలు అధిక మెజార్టీ వారే తెలుగుదేశం పార్టీ గెలుపొందారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలోనే తాడిపత్రి జడ్పిటిసి సభ్యునిగా రావి రాజేంద్ర ప్రసాద్ తెలుగుదేశం పార్టీ తరుపున 27,613 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పెద్దపప్పూరు జడ్పిటిసి సభ్యునిగా జనసేన తరుపున కదిరి శ్రీకాంత్‌రెడ్డి 15,506 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. యాడికి జడ్పిటిసి సభ్యునిగా వేలూరు రంగయ్య టిడిపి తరుపున 17,335 మెజార్టీతో గెలుపొందారు. పెద్దవడుగూరు జడ్పిటిసి సభ్యునిగా తెలుగుదేశం పార్టీ తరుపున పామిరెడ్డి స్వరూపారాణి తెలుగుదేశం పార్టీ తరుపున 5,918 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇదే విధంగా శింగనమల నియోజకవర్గానికి చెందిన యల్లనూరు, పుట్లూరు మండలాల్లో కూడా జెసి మార్క్ రాజకీయం వల్ల టిడిపి వారు ఎక్కువ మెజార్టీలతో గెలుపొందారు. పుట్లూరు జడ్పిటిసి సభ్యునిగా తెలుగుదేశంకు చెందిన బూసి వరలక్ష్మి 16870 మెజార్టీతో,యల్లనూరు జడ్పిటిసి సభ్యునిగా వెన్నపూస లలిత తెలుగుదేశం పార్టీ తరుపున 11,846 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. టిడిపి తరుపున మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి, ఇతరులు వివిధ రూపాల్లో బెదిరింపు చర్యలకు దిగడం వల్లే తమ పార్టీ వారు ఎన్నికలకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చిందని, అందుకే టిడిపి వారికి ఎక్కువ మెజార్టీ వచ్చాయని వైసిపి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీకి తాడిపత్రి నియోజకవర్గంలో మెజార్టీ స్థానాలు వచ్చాయి.

శ్రీసత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి పరిటాల శ్రీరామ్‌కే..!

- మంత్రి నారా లోకేష్ గ్రీన్ సిగ్నల్

అనంతపురం, నవంబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

టిడిపి యువనేత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కే శ్రీసత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇవ్వాలని కూటమి పార్టీల మధ్య నిర్ణయమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్ర మంత్రి నారాలోకేష్‌ను ప్రత్యేకంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఇతర కుటుంబ సభ్యులు కలిసి పార్టీకి చేసిన సేవలను వివరించినట్లు సమాచారం. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ హోదాలో ఇంకా భాగా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని, అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలని ఎక్కడా పొరపాట్లు చేయవద్దని మంత్రి నారాలోకేష్ ప్రత్యేకంగా పరిటాల శ్రీరామ్‌కు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో శ్రీసత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్‌పై ఉత్కంఠ తొలిగిపోయినట్లేనని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం పరిటాల శ్రీరామ్‌తోపాటు జనసేన పార్టీ తరుపున చిలకం మధుసూధన్‌రెడ్డి ఆశిస్తూ వచ్చారు. పరిటాల శ్రీరామ్ కదిరి నియోజకవర్గం నుండి నల్లచెరువు జడ్పిటిసి సభ్యునిగా గెలుపొందగా చిలకం మధుసూధన్‌రెడ్డి పుట్టపర్తి జడ్పిటిసి సభ్యునిగా గెలుపొందారు. జిల్లాపరిషత్ చైర్మన్‌గా నికే ఇస్తామని ముందుగా చెప్పడంతో పరిటాల శ్రీరామ్ తగిన రీతిలో వివిధ మండలాలకు సహాయ సహకారాలు చేసినట్లు తెలుస్తోంది. పరిటాల శ్రీరామ్ తల్లిదండ్రులు పార్టీ కోసం చేసిన కృషిని కూడా పరిగణలోకి తీసుకోవడంతోపాటు ఎన్నికల్లో చేసిన ఖర్చులు కూడా దృష్టిలో పెట్టుకుని పరిటాల శ్రీరామ్‌కే జిల్లా పరిషత్ చైర్మన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో జనసేన పార్టీ తరుపున జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఆశిస్తున్న చిలకం మధుసూధన్‌రెడ్డి కూడా తమకే చైర్మన్ పదవి వస్తుందని ధీమాతో ఉన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వడం వల్లే జడ్పిటిసి సభ్యునిగా నేను పోటీ చేశానని, చైర్మన్ పదవి లేకుంటే పుట్టపర్తికి వెళ్లి జడ్పిటిసిగా ఎందుకు పోటీ చేస్తానని, తమకే చైర్మన్ పదవి వస్తుంది, ఇందులో సందేహం పెట్టుకోవాల్సిన అవసరం లేదని తన సన్నిహితులతో చిలకం మధుసూదన్‌రెడ్డి చెబుతుండటం గమనార్హం. శ్రీసత్యసాయి జిల్లాలో 32 జడ్పిటిసి స్థానాలు ఉండగా 21 స్థానాలను టిడిపి వారు, 9 స్థానాలను వైసిపి వారు, 2 స్థానాలను జనసేన పార్టీ వారు చేజిక్కించుకున్నారు. బిజెపి ఒక్క స్థానాన్ని కూడా గెలవలేక పోయింది. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరం నియోజకవర్గంలో రెండు జడ్పిటిసిలను, పుట్టపర్తి నియోజకవర్గంలో 3 జడ్పిటిసిలను కదిరి నియోజకవర్గంలో 4 జడ్పిటిసిలను, వైసిపి చేజిక్కించుకుంది. కదిరి నియోజకవర్గంలో వైసిపి



వారు గెలిచిన 4 జడ్పిటిసిల్లో ఒక స్థానంలో బిజెపి అభ్యర్థి, మరోస్థానంలో జనసేన అభ్యర్థి పోటీ చేసి ఓడిపోయారు. ఆ ప్రభావం కూడా అక్కడి టిడిపిపై పడింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెజార్టీ జడ్పిటిసి స్థానాలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌కి పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గంలో రావడంతో అక్కడ కూటమి పార్టీలకు షాక్ ఇచ్చినట్లైంది. ఈ పరిస్థితుల్లో రాబోయే పంచాయితీ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపించాలని ఆయా నియోజకవర్గాల కూటమి ముఖ్యులు ఉన్నారు.

అనంత జడ్పి పీఠంపై వీడని చిక్కుముడి :

అనంతపురం జిల్లా పరిషత్ అధ్యక్షునిగా గార్లదిన్నె మండల జడ్పిటిసి సభ్యులు గంజె నాగరాజు పేరు దాదాపు ఖరారైందని టిడిపిలో ప్రచారం వుంది. అయితే తాజా రాజకీయాల నేపథ్యంలో ఉరవకొండ జడ్పిటిసి సభ్యుడు చిరంజీవి పేరు కూడా తెరపైకి వచ్చింది. వారిద్దరిలో మొదటి స్థానంలో నాగరాజు పేరు, రెండో స్థానంలో చిరంజీవి పేరు ఉంటూ వచ్చింది. ప్రస్తుతం కొత్తగా మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, మరికొందరు అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని మహిళలకు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా మహిళలు ఉన్నారని ఇప్పుడు కూడా చైర్మన్ గిరిని మహిళలకే కేటాయిస్తే భాగుంటుందని బావిస్తూ సామాజిక సమీకరణలో భాగంగా మహిళలకు కేటాయించే విధంగా చక్రం తిప్పుతున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం బిసి జనరల్‌కు రిజర్వ్ అయిన విషయం దృష్టిలో ఉంచుకొని కురుబ సామాజిక వర్గానికే చైర్మన్ స్థానాన్ని ఇవ్వాలని అందులో భాగంగా మహిళలకు కేటాయించాలని కొందరు, గార్లదిన్నె జడ్పిటిసి నాగరాజుకు ఇవ్వాలని కొందరు ఒత్తిడి చేస్తుండటంతో అనంతపురం జడ్పి చైర్మన్ పీఠం సస్పెన్స్ వీడలేదు. కురుబ సామాజిక వర్గానికి చెందిన మహిళ జడ్పిటిసిలు బుక్కరాయ సముద్రం, రాయదుర్గం, ఇతర మండలాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. నవంబర్ 19వ తేదిన మండలాధ్యక్షుని ఎంపిక, 20వ తేదిన జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపిక ఉంది. గత రెండు రోజులుగా విశాఖపట్నంలో పారిశ్రామిక వేత్తల సదస్సు వుండటంతో ముఖ్యులంతా అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. రెండు మూడు రోజుల్లో అధికారికంగా చైర్మన్ గిరిల పేర్లను ప్రకటించే అవకాశం వుంది.

సర్పంచ్ ఎన్నికలైనా సజావుగా జరిగేనా?

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో అధికార టిడిపి అరాచకాలపై తీవ్ర విమర్శలు

పోలీసులు, ఎన్నికల అధికారుల నిష్పక్షపాతంగా పని చేస్తారా

అనంతపురం రూరల్, నవంబర్14ప్రభాతవార్త



అనంతపురం రూరల్ మండల ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నుంచి.. ఓట్ల లెక్కింపు.. ఫలితాల విడుదల వరకు.. అధికార టిడిపి నాయకులు,కార్యకర్తలు.. అరాచకాలు.. బెదిరింపులు, దాడులు.. దౌర్జన్యాలు.. ఏ మేరకు చోటు చేసుకున్నాయో ప్రజలంతా మీడియాలో పత్రికల్లో చూశారు. ఇవి మరువక ముందే పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాలలో రాజకీయం మరోసారి హిటెక్కనుంది. గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలవేళ.. ఎలాంటి హింసాత్మక ఘటనలు ఘర్షణలు చోటు చేసుకుంటాయోనన్న భయాందోళన నెలకొన్నాయి.

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో టిడిపి నాయకుల అరాచకాలపై విమర్శలు

అనంతపురం రూరల్ మండలంఎంపీటీసీ ,జడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల సందర్భంగా అనంతపురం రూరల్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో.. తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. టిడిపినాయకులు ,కార్యకర్తలు వందలాదిమంది తరలివచ్చి ప్రతిపక్ష వైసిపి అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు నామినేషన్లు వేసేందుకు వస్తే అడ్డుకొని.. నామినేషన్ పేపర్లను.. చింపివేసి దాడులు చేసి భయాందోళనలు సృష్టించారు. నామినేషన్లు వేసేందుకు జనాలతో. వైసీపీ నాయకులు కూడా ర్యాలీగా వస్తే వారిని కూడా అడ్డుకొని రాళ్లు విసిరి దాడులు చేయడంతో పలువురు వైసిపి నాయకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీస్ అధికారులు అధికార పెద్దలకు వత్తాసు పలుకుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు వందలాది మంది వచ్చినా. పట్టించుకోకుండా.. వైసీపీ అభ్యర్థుల నాయకులు, కార్యకర్తలు కనీసం నలుగురు, ఐదు వచ్చినా కూడా అభ్యంతరం తెలిపారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి.. దాడులకు తెగబడ్డారు. పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు ఎన్నికల ఫలితాలలో కూడా.. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు.. అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరించారని వైసిపి నాయకులు తీవ్రంగా ఆరోపించారు.

సర్పంచ్ ఎన్నికల్లోనైనా పోలీసులు, ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా పని చేస్తారా ?

ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో.. అధికార పార్టీకి అనుకూలంగా, ఏకపక్షంగా పనిచేశారన్న విమర్శలు పాలైన ఎన్నికల అధికారులు, పోలీసులు.. ప్రస్తుత సర్పంచ్ ఎన్నికలలో పారదర్శకంగా పనిచేస్తారా? లేక ఇక్కడ కూడా అధికార ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పని చేస్తారాన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల అధికారులు, పోలీసులు.. అధికార పార్టీ అనుకూలంగా పనిచేయడం వల్లనేతమఒడిపోయామని, ప్రజాస్వామ్య పద్ధతిలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించి ఉంటే.వైసీపీదే గెలుపు అని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. పోలీసులు, ఎన్నికల అధికారులు తీరు మార్చుకొని.. సర్పంచ్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రతిపక్ష వైసిపి డిమాండ్ చేస్తుంది.

పంచాయతీ ఎన్నికలపై ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యూహరచన

- ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన రాప్తాడు జడ్పీటీసీ జయలక్ష్మి

రామగిరి, నవంబర్ 14 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తును మరింత వేగవంతం చేశారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంతో పాటు రామగిరి మండలం వెంకటాపురంలోనూ ఆయా మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశమై చర్చలు జరిపారు. నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, కనగానపల్లి మరియు చెన్నేకొత్తపల్లి మండలాలలోని పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశాలలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రధానంగా ఆయా పంచాయతీల రిజర్వేషన్లను బట్టి రేసులో ఎవరెవరు ఉన్నారు, క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన అభ్యర్థి అవుతారు అనే దానిపై ఆరా తీశారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన విధేయత, నాయకుల సీనియారిటీతో పాటు పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశం కల్పించే అంశాలపై కూడా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేలా ఎమ్మెల్యే సునీత దిశానిర్దేశం చేశారు. అంతకుముందు, ఇటీవల జరిగిన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

స్థానిక సంస్థల ఎన్నికలలో రాప్తాడు మండల జడ్పీటీసీగా ఘనవిజయం సాధించిన జయలక్ష్మి అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి గారిని ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, నిరంతరం ప్రజాసేవలో భాగమవ్వాలని సూచించారు. ఈ సమావేశాలలో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద నిఘా నేత్రం : ఎస్పీ

ప్రతి కదలికపై నిఘా.. డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు..! ఎస్పీ హెచ్చరిక..

ధర్మవరం రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త



ఎస్పీ సతీష్ కుమార్

గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటన లకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ధర్మవరం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

ప్రతి కదలికపై పోలీసుల కన్ను..!

నామినేషన్ల సందర్భంగా గ్రామాల్లో రాజకీయ ఉద్రిక్తతలు, వర్గ విభేదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా ప్రతి కదలికను పర్యవేక్షించనున్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట అదనపు బలగాలను మోహరించేలా చర్యలు చేపట్టారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు..!

నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులు, వారి మద్దతుదారులు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. ఇతర అభ్యర్థులను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం, గొడవలకు దిగడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యేలా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పదవీ విరమణ అంచున అనంతపురం డీఈఓ



ప్రసాద్ బాబు

అయూబ్ హుస్సేన్

కొత్త అధికారి ఎవరు?

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోస్టింగ్‌పై ఉత్కంఠ

తిరిగి బాధ్యతలు చేపట్టేది ప్రసాద్‌బాబునా? లేక కొత్త అధికారికి అవకాశం?

విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగుతారా?:

ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు సేవల్లో కొనసాగితే బాగుంటుందని అయూబ్ హుస్సేన్ భావిస్తున్నట్లు సమాచారం. పదవీ విరమణ అనంతరం కూడా విద్యా సంవత్సరం ముగిసే వరకు సేవలు కొనసాగించేందుకు ప్రభుత్వానికి లేఖ రాసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పదవీ విరమణ అనంతరం కొనసాగింపు అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

ప్రసాద్‌బాబుకు మళ్లీ అవకాశం దక్కుతుందా?:

గతంలో అనంతపురం జిల్లా డీఈఓగా పనిచేసిన ప్రసాద్‌బాబు తిరిగి అదే బాధ్యతలు చేపడతారనే ప్రచారం ప్రస్తుతం జోరుగా సాగుతోంది. జిల్లాలో ఏడాదికి పైగా పనిచేసిన అనుభవం ఉండటంతో విద్యాశాఖ వ్యవహారాలపై ఆయనకు అవగాహన ఉంది. ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాఖను ముందుకు తీసుకెళ్లిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం సెలవు ముగించుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

డిసెంబర్ 5 తర్వాతే కొత్త డీఈఓ?:

ఎన్నికల కోడ్ డిసెంబర్ 5వ తేదీ వరకు ఉంటుందనే ప్రచారం నేపథ్యంలో ఆ తర్వాతే కొత్త డీఈఓ నియామకానికి మార్గం సుగమమవుతుందా? అనే చర్చ సాగుతోంది. అయితే ఎన్నికల కోడ్ ముగింపు అనేది ఎన్నికల ప్రక్రియ, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ఉత్తర్వులపై ఆధారపడి ఉంటుంది. కోడ్ ముగిసిన తర్వాత సాధారణ పరిపాలనా నియామకాలకు ఉన్న ఎన్నికల పరిమితులు తొలగవచ్చు. అయినప్పటికీ ప్రసాద్‌బాబుకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలంటే సెలవు రద్దు, విధుల్లో చేరేందుకు అనుమతి, పోస్టింగ్ ఉత్తర్వులు వంటి ప్రక్రియలు పూర్తవ్వాలి. మొత్తానికి ఈ నెలాఖరున ప్రస్తుత డీఈఓ పదవీ విరమణ చేయనుండటంతో అనంతపురం జిల్లా విద్యాశాఖలో తదుపరి అధికారి ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది. అయూబ్ హుస్సేన్ సేవలను కొనసాగిస్తారా? ప్రసాద్‌బాబుకు తిరిగి అవకాశం కల్పిస్తారా? లేక ప్రభుత్వం మరో అధికారిని నియమిస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

తాను బరిలో నిలిపే సర్పంచు అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల రూపు రేఖలు మారుస్తా

-మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్, నవంబర్ 14 ప్రభాతవార్త



మీడియాతో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాను బరిలో నిలిపే సర్పంచు అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల రూపు రేఖలు మారుస్తానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని వారు సైతం అభివృద్ధి చేస్తామంటూ ముందుకు వస్తున్నారని విమర్శించారు. గతంలో రెండుసార్లు, మూడుసార్లు సర్పంచులుగా పనిచేసిన వారు కూడా మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా స్థానిక ఆదాయ వనరులతో గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. తాడిపత్రి మున్సిపాలిటీలో నాలుగు కోట్ల రూపాయలతో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశామని జె.సి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గతంలో నెలకు 36 లక్షల రూపాయలు ఉన్న విద్యుత్ బిల్లులో 24 లక్షల రూపాయలు ఆదా చేస్తున్నామని వెల్లడించారు. తాడిపత్రి మున్సిపాలిటీ వాహనాల నిర్వహణ విషయంలో ఇతర మున్సిపాలిటీలకు సవాల్ విసిరే స్థాయిలో ఉందన్నారు. సోమవారం నుంచి సర్పంచు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని ప్రకటించారు. గ్రామాల్లో మార్పు తీసుకురావడం, అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తాను బరిలోకి దింపిన సర్పంచు అభ్యర్థులను ప్రజలు గెలిపిస్తే గ్రామాల రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. తన అభ్యర్థులను ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉందని జె.సి ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు.

02ATP26_02ATP26.qxd 14-11-2026 PM 10:22 Page 1

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



గ్రంథాలయ వారోత్సవాలను ముఖ్య అతిథి రాజన్న ప్రసంగిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, నవంబర్ 14 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయుడు రాజన్న, ఉజ్వల హోం శ్యామల, వక్తలుగా మహేష్, ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి హెచ్. శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ, కవిసమ్మేళనాలు, సెమినార్లు, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, దిశ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కే. ఉమామహేశ్వరి, వసంత, విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ఎంపిడిఓ



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో ఎంఈఓ


బ్రహ్మసముద్రం నవంబర్ 14 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నెహ్రూ జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ సత్యవతమ్మ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో ఏకాంబరేశ్వరయ్య ఎంఈఓ ఓబుళపతి కృష్ణా నాయక్ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పి ఎం సిరి పథకం కింద కిచెన్ గార్డెన్ ను పరిశీలించి మొక్కలు నాటారు ఆరోగ్యకరమైన కూరగాయలు పండించుకోవడంలో కిచెన్ గార్డెన్ ఎంతో సహాయపడుతుందని సూచించారు ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థి దశ నుండి మొక్కలు నాటడం పై అవగాహన కలిగి ఉండి భావితరాలకు మునుగడనిచ్చే చెట్లను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నేటి నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు పర్వం షురు

మండలంలో గ్రామాల వారీగా ఐదు నామినేషన్ కేంద్రాలు నిర్వహణ

శెట్టూరు నవంబర్ 14 ప్రభాతవార్త



ఎంపీడీఓ జిలాని భాష

మండలంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల అభ్యర్థులు తమ పరిధిలో కేటాయించిన గ్రామ సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. గ్రామాల వారీగా నామినేషన్ కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి. 1. ములకలేడు గ్రామ సచివాలయం: ములకలేడు, తిప్పనపల్లి, అనుంపల్లి గ్రామాలు. 2. లక్ష్మంపల్లి గ్రామ సచివాలయం: లక్ష్మంపల్లి, చెర్లోపల్లి, మాకొడికి, కైరేవు గ్రామాలు. 3. అయ్యగార్లపల్లి గ్రామ సచివాలయం: అయ్యగార్లపల్లి, పెరుగుపాళ్యం గ్రామాలు. 4. శెట్టూరు ఎంపీడీఓ కార్యాలయం: శెట్టూరు, చింతర్లపల్లి, కనుకూరు, బచ్చేహళ్లి గ్రామాలు. 5. యాటకల్లు గ్రామ సచివాలయం: యాటకల్లు, ఐదుకల్లు, చిన్నంపల్లి గ్రామాలు. అభ్యర్థులు తమ గ్రామానికి కేటాయించిన నామినేషన్ కేంద్రాన్ని ముందుగానే తెలుసుకుని, అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకొని నిర్ణీత గడువులో నామినేషన్లు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఆయా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎంపీడీఓ జిలాని భాష తెలిపారు.

ఎన్నికల నిబంధనలను విధిగా పాటిద్దాం : ఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.హిరెహోళ్

డి.హిరెహోళ్ నవంబరు 14 ప్రభాతవార్త

పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం ప్రారంభం కానున్న సర్పంచుల నామినేషన్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని క్లస్టర్ స్టేజ్ వన్ ఎన్నికల అధికారుల కు మండల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో దాస్ నాయక్ సూచనలిచ్చారు. శనివారం డి.హిరెహోళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ విధి విధానాలపై ఎంపీడీవో క్లస్టర్ స్టేజ్ వన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్ల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా అవసరమైన జాగ్రత్తలు అన్నింటిని తీసుకోవాలని ఆయన తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు సర్పంచులు, వార్డు సభ్యులు అభ్యర్థులు దాఖలు చేస్తున్న నామినేషన్ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న అంశాలను ధ్రువీకరించాలని ఆయన వివరించారు. సర్పంచ్ అభ్యర్థులకు, వార్డు సభ్యుల అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సారంజామా తో పాటు నామినేషన్ కు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు అవసరమైన తదితర సరంజామాను స్టేజి వన్ అధికారులైన ఎన్నికల అధికారులకు అందజేశారు. డి.హిరెహోళ్ మండల పరిధిలోని 16 పంచాయితీల్లో 37,100 మంది ఓటర్లు 168 పోలింగ్ బూతులు ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళ ఓటర్లు 18617 మంది కాగా, పురుష ఓటర్లు 18478 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరు ఈనెల 26న జరగనున్న పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగ తమ ఓటు హక్కును వినియోగించుకుని సర్పంచులు, వార్డు సభ్యులు భవిష్యత్తును నిర్ణయించనున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ స్టేజ్ వన్ ఎన్నికల అధికారులు ఏవో క్రిష్ణకిషోర్ రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ, ఎంఈఓ వన్ వేణుగోపాల్, గురుమునిక్రిష్ణ, డిప్యూటీ ఎంపీడీవో యోగానంద, పాలనాధికారి బలరామరావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశులు, ఆయా పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

నేటి నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

కణేకల్ నవంబర్ 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల (2026) నేపథ్యంలో.. కనేకల్ మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఆదివారం (నవంబర్ 15) నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని. ఎస్.ఐ. నాగమధు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాగ మధు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నామినేషన్ల పర్వం మూడు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు.



ఎస్ఐ నాగ మధు

ఐదు కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

అభ్యర్థులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు మండల వ్యాప్తంగా మొత్తం 5 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు . ఆయా గ్రామాల అభ్యర్థులు తమ పంచాయతీకి కేటాయించిన నిర్దిష్ట కేంద్రాలకే వెళ్లి నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు. 1. హుళికెర స్వర్ణ గ్రామం సెంటర్ : హుళికెర, గోపులాపురం, రచ్చుమర్రి గ్రామ పంచాయతీలు. 2. ఉడేగోళం స్వర్ణగ్రామం సెంటర్: ఉడేగోళం, బ్రహ్మసముద్రం, బెన్నికల్ గ్రామ పంచాయతీలు. 3. మాల్యం స్వర్ణగ్రామం సెంటర్: మాల్యం, గరుడచేడు, బిదురుకొంతం, తుంజగానూరు గ్రామ పంచాయతీలు. 4. సొల్లాపురం స్వర్ణగ్రామం సెంటర్: సొల్లాపురం, ఎన్. హనుమాపురం, హనకనహోళ్ గ్రామ పంచాయతీలు. 5. కనేకల్ సెంటర్ (ఏపీఓ, వీబీజీ రామ్ ఆఫీస్): కనేకల్, ఎర్రగుంట, గణిగెర, జక్కలవడికి, కలేకుర్తి గ్రామ పంచాయతీలు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ కఠినంగా అమలులో ఉంటాయని ఎస్సై నాగమధు హెచ్చరించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ఒక సపోర్ట్ మెంబర్, ప్రతిపాదకుడు (ప్రపోజర్) మాత్రమే అనుమతించబడతారు అన్నారు. 100 మీటర్ల నిషిద్ధ ప్రాంతం నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాలు (షాపులు) పూర్తిగా మూసివేయాలని, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని ఆదేశించారు. స్థానికులకు హెచ్చరిక: కేంద్రాలకు 100 మీటర్ల లోపు నివాసం ఉండే ఇళ్ల వారు తమ కుటుంబ సభ్యులు మినహా, బయటి వ్యక్తులు లేదా కొత్తవారు ఎవరూ తమ ఇళ్ల వద్ద గుమిగూడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించి, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్సై నాగమధు విజ్ఞప్తి చేశారు.

ఉరవకొండ మండలంలో 6 నామినేషన్ దాఖలు కేంద్రాలు

- మండలంలో 18 పంచాయతీల సర్పంచ్, 196 వార్డు సభ్యుల స్థానాలు

- విలేఖరులతో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త



ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఉరవకొండ మండలంలో నామినేషన్ల దాఖలుకు 6 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. మండలం లో 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలు, 196 వార్డు స్థానాలకు 3వ విడతలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకు చెందిన వారు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ దాఖలు కేంద్రంలో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. చిన్నము ష్టూరు, ఇంద్రావతి, మోపిడి, పెద్దముష్టూరు పంచాయతీల వారు మండల పరిధిలోని మోపిడి గ్రామంలోని స్వర్ణగ్రామం కార్యాలయంలో నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. బూదగవి, నింబగల్లు, రేణుమాకులపల్లి, వెలిగొండ పంచాయతీల వారు బూదగవి స్వర్ణగ్రామం కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. నెరమెట్ల, రాయంపల్లి, వ్యాసాపురం గ్రామ పంచాయతీలకు చెందిన వారు రాయంపల్లి స్వర్ణగ్రామం కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఆమిద్యాల, పెద్దకౌకుంట్ల, రాకెట్ల పంచాయతీల వారు పెద్దకౌకుంట్ల పీఏసీఎస్‌లో భవనంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. లత్తవరం, లత్తవరం తండా, షేక్షానుపల్లి పంచాయతీల వారు లత్తవరం రైతు సేవా కేంద్రం భవనంలో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ వివరించారు.

అట్టహాసంగా ఉరగాద్రి బాలోత్సవం-2026 కార్యక్రమం

- ముఖ్య అతిథులుగా హాజరైన సీఐ మహానంది, వజ్రకరూరు ఎంఈవో తిమ్మప్ప - వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న వజ్రకరూరు మండల విద్యాధికారి తిమ్మప్ప



ఎస్.కె.జంగి బంజారాకు ఆదర్శ విద్యార్థి అవార్డును అందజేస్తున్న సీఐ మహానంది

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని షిరిడిసాయి బాబా కళ్యాణ మండపంలో శనివారం జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరగాద్రి బాలోత్సవం-2026 బహుమతుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉరవకొండ అప్‌గ్రేడ్ సీఐ మహానంది, వజ్రకరూరు మండల విద్యాధికారి తిమ్మప్ప, ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, లక్ష్మినరసింహా కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలోత్సవంలో భాగంగా గత నెలలో 16 అంశాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. చదువుతోపాటు ఆటల్లో రాణిస్తూ మంచి సంస్కార కలిగి అనేక విషయాల్లో నైపుణ్యం సాధించినటువంటి 9 మంది విద్యార్థులకు ఆదర్శ విద్యార్థి అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు, వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీయడంలో భాగంగా జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిస్వార్థ ఫౌండేషన్ ఉరగాద్రి బాలోత్సవం పేరుతో ప్రతి ఏడాది పోటీలు నిర్వహిస్తుండటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు హనుమప్ప, భాస్కర్, ఓబన్న, నిస్వార్థ బృంద సభ్యులు దివాకర్, నాగమల్లి ఓబులేష్, శ్రీదేవి, నిర్మల, పద్మావతి, పృధ్వి, సాయిరాం, చిట్టెమ్మ, రాధ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 19న గుడిబండ ఎంపీపీ, ఉపాధ్యక్షుల ఎన్నిక

గుడిబండ నవంబర్ 14 ప్రభాతవార్త



ప్రిసైడింగ్ అధికారి జయకుమార్

ఈ నెల 19వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతన ఎంపిపి ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిసైడింగ్ అధికారి కె. జయకుమార్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల సమక్షంలో కోఆప్షన్ సభ్యుడి ఎన్నికతో పాటు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలలోపు కోఆప్షన్ సభ్యుడి ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేయాలని, అనంతరం ఎంపీపీ, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

అఖండ విజయాన్ని కొనసాగిద్దాం

జడ్పిటిసి భాగ్యలక్ష్మి అరుణాచల్ రెడ్డి



వేదికపై ప్రజాప్రతినిధులు, నాయకులు



హాజరైన కార్యకర్తలు

హిందూపురం నవంబర్ 14 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలలో హిందూపురం నియోజకవర్గంలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సాధించిన అఖండ విజయాన్ని సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఐక్యతతో కొనసాగిద్దామని హిందూపురం జడ్పిటిసి సభ్యులు భాగ్యలక్ష్మి అరుణాచల్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన జడ్పిటిసి ఎంపిటిసి సభ్యుల అభినందన కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ క్యాంపు కార్యాలయం లో శనివారం ఉదయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జడ్పిటిసి ఎంపీటీసీలు ఎన్నికల్లో సాధించిన విజయాలు కార్యకర్తల శ్రమ మరువలేనిదని పేర్కొన్నారు. బాలయ్య సహకారంతో హిందూపురం అన్ని రంగాల్లో అభివృద్ధి పథం లో సాగుతోందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఇదే తరహాలో కష్టపడి పనిచేసి ఘన విజయాలు సాధించేందుకు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పి ఏ బాలాజీ నేతృతంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ రెడ్డి, మండల కన్వీనర్ రాము, చిన్నారెడ్డి, సంతేబిదనూరు ఆర్య ఈడిగ గౌడ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసులు మొదలగు వారు పాల్గొన్నారు.

ప్రారంభమైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుంతకల్లు, నవంబర్ 14 ప్రభాతవార్త



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలల దినోత్సవం, భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. అంతకుముందు విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ తహశీల్దార్ సుబ్బలక్ష్మి, తుంగభద్ర దిగువ కాలువ డిఈ మంజునాథ్, గ్రంథాలయ అధికారిని సుజాత పాల్గొని గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఆదిలక్ష్మి, నరసింహ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఆరు కేంద్రాలు ఏర్పాటు

- ఎంపీడీఓ ప్రభాకర్

గుత్తి, నవంబర్ 14 ప్రభాతవార్త



ఎంపీడీఓ ప్రభాకర్

గుత్తి మండల వ్యాప్తంగా జరగనున్న 24 గ్రామపంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణకు 6 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్బేదొడ్డి, మాముడూరు, రజాపురం, శ్రీపురం గ్రామపంచాయతీలకు అబ్బేదొడ్డి గ్రామ సచివాలయంలో నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. పెద్దొడ్డి, చెర్లోపల్లి, బ్రాహ్మణపల్లి, ఎర్రగుడి గ్రామపంచాయతీలకు పెద్దొడ్డిలోని రైతు భరోసా కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. లచ్చానపల్లి, బసినేపల్లి, బసినేపల్లి తండా, తురకపల్లి, గ్రామపంచాయతీలకు బసినేపల్లి గ్రామపంచాయతీలో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా వెంగన్నపల్లి, బేతాపల్లి, ఊటకల్లు పంచాయతీ ఎన్నికలకు బేతాపల్లి గ్రామ సచివాలయంలో నామినేషన్లను స్వీకరణ జరుగుతుందన్నారు. ఈ నెల 18 నుండి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 29న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



బెలుగుప్ప నవంబర్ 14 ప్రభాతవార్త

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మొదటి రోజు 14.11.2026.న బెలుగుప్ప మండల కేంద్రంలో ని శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ప్రారంభోత్సవం మరియు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి బెలుగుప్ప మండల కేంద్రంలో గ్రంథాలయానికి 30 సంవత్సరాలు ఫ్రీగా సర్వీస్ చేసిన కే రామ్ రెడ్డి రిటైర్డ్ కండక్టర్ ఎం ఎరి స్వామి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు బాలల పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ వారి విద్యాభివృద్ధికి భవిష్యత్తు నిర్మాణంలో ఆయన ఆశయాలు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది తదనంతరం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రాముఖ్యత వివరిస్తూ సమాజంలో గ్రంథాలయాల పాత్ర విజ్ఞాన అభివృద్ధిలో పుస్తక పఠనము యొక్క ప్రాముఖ్యత విద్యార్థుల్లో పఠన శక్తిని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవలసిన అవసరాన్ని వివరించడం జరిగింది గ్రంథాలయాల కేవలం పుస్తకాలను చదివే ప్రదేశాలే కాకుండా విజ్ఞానాన్ని ఆలోచన శక్తిని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే విజ్ఞాన కేంద్రాలను తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినిలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

మన బడి మన తోట కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహన

రొళ్ల నవంబర్ 14 ప్రభాతవార్త



విద్యార్థులకు మనబడి మన తోట కార్యక్రమం పై వివరిస్తున్న ఉపాధ్యాయులు

మండలం దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలురు గురుకుల పాఠశాలలో శనివారం మన బడి మన తోటఖికార్యక్రమాన్ని ప్రిన్సిపల్ మైలారప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి పూజించారు.అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ..నెహ్రూకు పిల్లలపై ఉన్న ప్రేమను గుర్తు చేసుకొని నెహ్రూ అడుగుజాడలో విద్యార్థులు నడవాలని సూచించారు. తోలుతూ.. పాఠశాలల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు,, పండ్ల మొక్కలను పెంచే ఒక విద్యా, పోషకాహార వాటి పద్ధతులను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడంతో పాటు,పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగిస్తున్న తాజా కూరగాయలు పౌష్టికాహార్ల పై వివరించారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పండించిన తాజా కూరగాయలు, ఆకుకూరలను పాఠశాల మధ్యాహ్న భోజనంలో ఉపయోగిస్తారని విద్యార్థులకు ప్రదర్శన ద్వారా తెలియజేశారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందుతుందన్నారు.ప్రయోగాత్మక విద్య.జీవశాస్త్రం,పర్యావరణ పరిరక్షణ,మరియు గణితంలోని అంశాలను విద్యార్థులు తోటపని ద్వారా ప్రత్యక్షంగా వివరించారు. శ్రమ పట్ల గౌరవం. వారంలో ఒకరోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి తోటలో పనిచేయడం వల్ల శ్రమ విలువ, సామాజిక బాధ్యత అలవడుతాయిన్నారు. పాఠశాల ఆవరణంలో చెట్లను నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ. పాఠశాల ప్రాంగణం పచ్చదనం పెంపొందడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందనీ విద్యార్థులకు వివరించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.42 వేలు, పెన్షన్ రూ.21వేలు అమలు చేయాలి..!

- పార్లమెంట్ సభ్యులకు జీవితకాల పెన్షన్ ఉన్నప్పుడు కాంట్రాక్ట్ కార్మికులకు ఎందుకు లేదు?- ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు!- డిసెంబర్ 1 నుంచి ఢిల్లీ ముట్టడి - సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, తదితరులు

అనంతపురం, నవంబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం డిసెంబర్ 1 నుంచి ఢిల్లీలో నిర్వహించే చలో ఢిల్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను శనివారం అనంతపురంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాటానికి సిద్ధమవుతున్నారని, అనంతపురం జిల్లా నుంచి వేలాదిగా కార్మికులు ఢిల్లీకి తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్నారని, మరో మూడు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, కంటింజెంట్, డైలీ వేజ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు కనీసం రూ.42 వేల వేతనం అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 1 నుంచి ఢిల్లీలో నిర్వహించే ముట్టడి కార్యక్రమంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.వి. నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, ఆఫీస్ బేరర్స్ రమాదేవి, ముత్తుజ, శకుంతల, గోపాల్, శివప్రసాద్, ఉమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పౌండేషన్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం, నవంబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో గ్రామాలలో కక్షలు లేకుండా ప్రశాంతంగా కొనసాగాలని కోరుతూ వేమన పౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురములో శనివారం నాడు కరపత్రాలు ఆవిష్కరించారు. ఎన్నికలు ఒకరోజు మాత్రమే కొనసాగితే పగలు ప్రతీకారాలు వర్గాలు దీర్ఘకాలికంగా కొనసాగి ఆ కుటుంబాలకే కాకుండా గ్రామాభివృద్ధికి ఆటంకం అవుతుందని శాంతియుత జీవనం భావితరాలకు మంచిదని ఈ సందర్భంగా వేమ పౌండేషన్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, కార్యదర్శి డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సభ్యులు రవీంద్రరాజు, మనోరంజన్ రెడ్డి, నాగశేషారెడ్డి తెలిపారు.

మాంటిస్సోరిలో బాలల దినోత్సవ వేడుకలు



అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అనంతపురంలోని సంగమేశ్ నగర్‌లో ఉన్న మాంటిస్సోరి పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోద కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు దేశభక్తి, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించినట్లు పాఠశాల ప్రతినిధి తెలిపారు. పిల్లల ఆనందమే సమాజ భవిష్యత్తుకు పునాది అని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మంచి వాతావరణం, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

మినర్వాలో బాలల దినోత్సవ వేడుకలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న మినర్వా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలంటే జవహర్‌లాల్ నెహ్రూకు ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని, చిన్నారులే దేశ భవిష్యత్తుకు పునాదులని ఆయన విశ్వసించేవారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గార్లదిన్నె, నవంబర్ 14,ప్రభాతవార్త:



గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

గార్లదిన్నె శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి కె.ఎం. శిరీష తెలిపారు. చివరి రోజున అక్షరాస్యతా కార్యక్రమంతో పాటు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాబా ఫక్రుద్దీన్, డిప్యూటీ ఎంపీడీఓ ఖాదర్ వలి, పంచాయతీ కార్యదర్శులు మహేష్ రెడ్డి, నరేష్, శివరంజిని తదితరులు పాల్గొన్నారు.

బృహస్పతి లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

అనంతపురం న్యూటౌన్,నవంబర్ 14 ప్రభాతవార్త



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని బృహస్పతి విద్యా నికేతన్ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించగా, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చాటుకున్నారు. ఆటపాటలు, ఇతర కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఎస్. రవి శంకర్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడం పాఠశాల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల ఆనందం, వారి అభివృద్ధే పాఠశాల ప్రగతికి నిజమైన ప్రేరణ అని తెలిపారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేశాయి. ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ముగిశాయి.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త



భారత తొలి ప్రధానమంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని నవభారత్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల సందడి నెలకొంది. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పండిత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిట్టూరు కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను ఆచరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతోపాటు పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని తెలిపారు. నవభారత్ పాఠశాలలో విద్యాబోధనతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు వివిధ పాటలకు ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించడంతోపాటు సందేశాత్మక నాటికల ద్వారా ఆకట్టుకున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీలు, భగవద్గీత శ్లోకాల పోటీలు, చేతిరాత పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ముగించారు. కార్యక్రమంలో నిట్టూరు అనిత వందన సమర్పణ చేశారు.

గ్రంథాలయాలతోనే విజ్ఞానం.. ఉన్నత భవిష్యత్తుకు బాటలు!

- ఉద్యోగార్థుల కోసం త్వరలో స్టడీ సెంటర్ ఏర్పాటు
- 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్

అనంతపురం న్యూటౌన్,నవంబర్ 14 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ గ్రంథాలయ వారోత్సవాలు అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, విశిష్ట అతిథులుగా అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ యశ్వంత్ రావు, ప్రొఫెసర్ జి.వి. రమణ, సమాజ సేవకుడు కె.వి. రమణ, కళాభూషణ్ డాక్టర్ అంకె రామలింగమయ్య, జి. ఉమాదేవి, జె. హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల సౌకర్యార్థం త్వరలోనే ప్రత్యేక స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రంథాలయాలను వినియోగించుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ యశ్వంత్ రావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే గ్రంథాలయాలను వినియోగించుకోవడం వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇతర వక్తలు సైతం గ్రంథాలయాల ప్రాధాన్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ గ్రంథాలయాధికారి పి. కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి డి. గోవిందు, కార్యాలయ సిబ్బంది రామాంజినమ్మ, కిరణ్, జీవన, ముత్యాలమ్మ, ఇందిరమ్మ, శిరీష, సరస్వతమ్మ, శ్రీ విజయ తదితరులు పాల్గొన్నారు.

డా॥బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో నెట్ జీరో హెల్త్ క్యాంపస్

-ఘనంగా బాలల దినోత్సవం, కిచెన్ గార్డెన్ ప్రారంభోత్సవ కార్యక్రమం -గురుకులం ఆవరణంలో విత్తనాలు వేసి, మొక్కలు నాటిన విద్యార్థినులు



గురుకులం ఆవరణంలో విత్తనాలు నాటుతున్న విద్యార్థినులు

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త



మొక్క నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపాల్, ఎస్ఎంసీ ఛైర్మెన్

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డా॥బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నెట్ జీరో హెల్త్ క్యాంపస్ కార్యక్రమం ఘనంగా జరిగింది.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎంసీ ఛైర్మెన్ చంద్రశేఖర్

ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా గురుకులం ఆవరణంలో విద్యార్థినులు ఉపాధ్యాయినులతో కలిసి వివిధ రకాల విత్తనాలు భూమిలో వేయడంతోపాటు మొక్కలను నాటారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మెన్ చంద్రశేఖర్, నెట్ జీరో క్లస్టర్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మెన్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం

-స్వామి వారిని దర్శించుకొని ఆకుపూజలు చేయించిన భక్తులు



శ్రీదేవి భూదేవి సమేతుడైన ఊరేగుతున్న శ్రీవారు

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం కార్తీక శుద్ధ పంచమి శనివారం సాయంత్రం స్వామివారి ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాల నడుమ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున క్షేత్రానికి తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని

-డా॥బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త




గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తకాలను పరిశీలిస్తున్న ఉపాధాయయులు, విద్యార్థినులు

విద్యార్థినులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన అన్నారు. పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డా॥బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారిణి కుళ్లాయమ్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంచే ఎన్నో రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మంజులాదేవి, ఎస్ఎంసీ ఛైర్మెన్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మెన్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ల పీహెచ్‌సీలో మధుమేహ వ్యాధిపై అవగాహన

-వివిధ అంశాలు వివరించిన డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త



మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ

మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో శనివారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గ్రామస్థులకు మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.మహమ్మద్ షఫీ మాట్లాడుతూ మధుమేహం నివారణకు ముందస్తు చరయలు అనే నినాదంతో వివిధ అంశాలను వివరించారు. లావుగా ఉనన వారికి అనువంశికంగా, ఆహార అలవాట్లవల్ల మద్యపానం, ధూమపానం, జీవనశైలి తదితర కారణాలతో మధుమేహం బారిన పడతారన్నారు. అధిక దాహం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన, ఉన్నట్టు ఉండి బరువుతగ్గడం, నీరసం, అలసటలాంటిలక్షణాలతో మధుమేహం మొదలవుతుందన్నారు. ఈ లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించి సూచనలు పాటించాలన్నారు. నిత్యం వ్యాయామం, యోగ, నడక, సరైన పోషకాహారం, క్రమం తప్పకుండా వైద్యం పొందడం చాలా అవసరమన్నారు. లేకపోతే కిడ్నీలు దెబ్బతిని, చూపు, నరాలు ఇతరత్రా అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన రాప్తాడు జడ్పీటీసీ జయలక్ష్మి..

పంచాయతీ ఎన్నికలపై ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యూహారచన..

రాప్తాడు నవంబర్ 14 ప్రభాతవార్త



ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన రాప్తాడు జడ్పీటీసీ జయలక్ష్మి..

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రాప్తాడు మండల జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన గుండ్లమడుగు జయలక్ష్మి అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా జయలక్ష్మి ని ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, నిరంతరం ప్రజాసేవలో భాగమవ్వాలని సూచించారు , అలాగే ఎంపీటీసీ జడ్పిటిసిల్లో ఏవిధంగా విజయం సాధించారో అలాగే 16 సర్పంచులకు 16 సర్పంచులు గెలిచేలా కష్టపడి పని చేయాలని సూచించారు, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు, ప్రధానంగా ఆయా పంచాయతీల రిజర్వేషన్లను బట్టి రేసులో ఎవరెవరు ఉన్నారు, క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన అభ్యర్థి అవుతారు అనే దానిపై ఆరా తీశారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన విధేయత, నాయకుల సీనియారిటీతో పాటు పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశం కల్పించే అంశాలపై కూడా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేలా ఎమ్మెల్యే సునీత దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు జడ్పిటిసిజయలక్ష్మి, కురుబ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ , మండల ప్రధాన కార్యదర్శి, బడమీదపల్లి ఎంపీటీసీ దగ్గుపాటి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగలకుంట కృష్ణ, కొండప్ప, మాన్లు కోసే కేశవయ్య, గొనిపట్ల శ్రీనివాసులు, నారాయణస్వామి, పండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు సర్పంచ్ బరిలో టీడీపీ నుంచి 9 మంది!

పార్టీ కోసం కష్టపడిన వారికే అవకాశం దక్కుతుందా?

అభ్యర్థి ఎంపికపై గ్రామంలో ఆసక్తికర చర్చ!

గార్లదిన్నె, నవంబర్ 14, ప్రభాతవార్త:

గార్లదిన్నె మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన కల్లూరులో సర్పంచ్‌పదవికి టీడీపీనుంచి తొమ్మిదిమంది ఆశావహులు పోటీ పడుతున్నారు. బుడగజంగం బాబయ్య, సామల రాజన్న, సామల రామాంజినేయులు, డిష్ భాష, శేషయ్య, వడ్ల రామాంజినేయులు, వై. ఓబులేసు, దాబా జగదీశ్, బుడగ జంగం సురేంద్ర తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే వీరిలో పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన వారికి అవకాశం దక్కుతుందా? అందరినీ కలుపుకొని వెళ్లే నాయకుడికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తుందా? అన్న చర్చ కల్లూరులో మొదలైంది. తొమ్మిది మందిలో పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందోనన్న ఉత్కంఠ గ్రామంలో నెలకొంది.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నాలుగు క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణ..

గార్లదిన్నె, నవంబర్ 14, ప్రభాతవార్త:

గార్లదిన్నె మండలంలో రెండో విడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణకు నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. గార్లదిన్నె క్లస్టర్‌లో మార్తాడు, కోటంక, సిరివరం, గార్లదిన్నె, తిమ్మంపేట, కన్నంపల్లి, కమలాపురం గ్రామ పంచాయతీల నామినేషన్లు స్వీకరించనున్నారు. ఎర్రగుంట్ల క్లస్టర్‌లో ఎర్రగుంట్ల, బూదేడు, కృష్ణాపురం, ముకుందాపురం, పెనకచెర్ల క్లస్టర్‌లో ఎంపీఆర్ డ్యామ్, పెనకచెర్ల, కొప్పలకొండ, కల్లూరు క్లస్టర్‌లో కల్లూరు, ఇల్లూరు, ముంటిమడుగు, కేశవాపురం గ్రామ పంచాయతీల నామినేషన్లు స్వీకరించనున్నారు. అభ్యర్థులు తమ గ్రామ పంచాయతీకి కేటాయించిన క్లస్టర్ పరిధిలోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలని ఎంపీడీఓ సూచించారు. ఈ విషయాన్ని అభ్యర్థులు, ప్రజలు గమనించాలని కోరారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబర్ 14 ప్రభాతవార్త

మీనాక్షి ఎండోక్రైన్ పీడియాట్రిక్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా డా.నెట్టెం శ్రీకాంత్ చౌదరి పర్యవేక్షణలో మధుమేహం, థైరాయిడ్, పిసిఓడి, ఊబకాయం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 130 మంది రోగులు హాజరయ్యారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఉచిత మందులను అందించారు. అదేవిధంగా ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, బరువు నియంత్రణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మధుమేహం వల్ల కలిగే, దీర్ఘకాలిక సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు.

ఎంజెపి కళాశాలలో ఘనంగా బాలల దినోత్సవం

గుడిబండ నవంబర్ 14 ప్రభాతవార్త



బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మీ విద్యార్థులకు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

04ATP13_04ATP13.qxd 14-11-2026 PM 10:30 Page 1

మీ పాలనలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం ఇవ్వగలవా

- రెండున్నరేళ్లు గడిచినా.. ఇంకా వైసిపి పైనే విమర్శలా
- ఎమ్మెల్యే దగ్గుపాటి తీరుపై మేయర్ రమేష్ గౌడ్ విమర్శ

అనంతపురం సిటీ, నవంబర్ 14 ప్రభాతవార్త



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ రమేష్ గౌడ్

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూ.14వందల కోట్లతో నగరంలో అభివృద్ధి చేశానని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ పనులపై శ్వేత పత్రం ఇవ్వగలరా అని నగర మేయర్ రమేష్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వైసిపి రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి జరగలేదని, జిల్లాకు అనంత వెంకటరెడ్డి ఏం చేశారని విగ్రహం పెట్టడం, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై మేయర్ రమేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. అనంతపురంజిల్లా అభివృద్ధికి అనంత వెంకటరెడ్డి ఏం చేశారో మీకు అవగాహన లేకుంటే మీ పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు వంటి వారిని అడిగితే తెలుస్తుందని సూచించారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా నగరాభివృద్ధికి ఏమీ చేయకపోగా వైసిపి పాలనపైనే విమర్శలు గుప్పిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోని నెంబర్ వన్ సిటీగా చేర్చాలని ఎమ్మెల్యే దగ్గుపాటి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని రెండున్నరేళ్లలో ఏం చేశారో నగర ప్రజలంతా చూశారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనతో విసిగిపోయి కార్పోరేషన్ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించారని స్పష్టం చేశారు. అదే విధంగా ఐదేళ్ల వైసిపి పాలనలో నాటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా 1045 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. గుత్తి రోడ్డు విస్తరణకు రూ.90కోట్లు, బళ్లారి బైపాస్ నుండి పంగల్ రోడ్డు రూ.311 కోట్లు వెచ్చించి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణంతోపాటు 18 నెలల్లోనే టవర్‌క్లాక్ బ్రిడ్జిని కూడా పూర్తి చేయించిన ఘనత అనంత వెంకటరామిరెడ్డికే దక్కుతుందన్నారు. అదే విధంగా అర్బన్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయితీలలో సైతం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇప్పటికైనా అవాస్తవాలు చెప్పడం మానుకొని నగరాభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

గ్రామాలలో అందరూ కలిసికట్టుగా శ్రమించండి

16 పంచాయతీల్లో తెదేపా జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బ్రహ్మసముద్రం నవంబర్ 14 ప్రభాతవార్త

సర్పంచ్ ఎన్నికల సమరంలో భాగంగా బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని శివాలయం దగ్గర జడ్పిటిసి పాలబండ్ల శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశం కు మండల వ్యాప్తంగా ఉన్న తెదేపా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశం కు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయతీలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలిచేలా ప్రతి ఒక్కరు గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసే మన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిని సహించేది లేదని అన్నారు కచ్చితంగా గెలిచే అభ్యర్థుల్ని ఎన్నుకొని సర్పంచులుగా నిలబెట్టాలని కార్యకర్తలకు సూచించారు.

నార్పల హైస్కూల్ బాలికల పాఠశాలలో హెచ్ఎం నాగేష్ వ్యవహారశైలిపై విద్యార్థుల తల్లిదండ్రుల అసంతృప్తి....

నార్పల నవంబర్ 4 ప్రభాత వార్త



మౌలిక వసతులు లేని బాలికల పాఠశాల

నార్పల హైస్కూల్ బాలికల పాఠశాలలో హెచ్ఎం నాగేష్ వ్యవహార శైలిపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పాఠశాల నిర్వహణ, పర్యవేక్షణలో హెచ్ఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

తల్లిదండ్రులు తెలిపిన ప్రధాన ఆరోపణలు:....

1. పాఠశాలలో విద్యార్థినులకు తాగునీటి సౌకర్యం సక్రమంగా అందుబాటులో ఉండటం లేదని, బాత్‌రూమ్‌లలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో నీళ్లు తాగితే బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుందనే ఇబ్బందితో విద్యార్థినులు నీళ్లు తాగడానికి కూడా వెనుకాడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
2. బోరు మోటారు వినియోగిస్తే విద్యుత్ బిల్లు పెరుగుతుందని, నీటి కొళాయిలు దెబ్బతింటాయని చెబుతూ బోరు మోటారును వినియోగించకుండా తాళాలు వేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.
3. పాఠశాలలోని సమస్యలను తల్లిదండ్రులు హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లినప్పుడు వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నప్పటికీ, ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.
4. తల్లిదండ్రులు ఫిర్యాదులు చేసిన విషయం తెలుసుకున్న అనంతరం విద్యార్థినులను పిలిపించి, మీ తల్లిదండ్రులు ఫిర్యాదులు చేస్తే మీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
5. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, ముఖ్యంగా బాలికల పాఠశాలలో ఉండాల్సిన కనీస పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మొత్తంగా:....

హెచ్ఎం నాగేష్ నిర్లక్ష్య వైఖరి, పాఠశాల పర్యవేక్షణలో లోపాలు, విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ సమస్యలపై త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులకు సంబంధించిన ఫోటోలు కూడా అందుబాటులో ఉన్నట్లు సమాచారం.

గమనిక:.... పై వివరాలు విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి అందిన ఆరోపణల ఆధారంగా సంబంధిత అంశాలపై క్షేత్రస్థాయి విచారణ ద్వారా వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. దీనిపై హెచ్ ఎం ను వివరణ అడిగితే ఎంతఊ లకు చెప్పామని, అయితే వాళ్లు పట్టించుకోలేదని చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనం సీజ్..

నిందితుడి పై చర్యలు తీసుకున్న అటవీశాఖ అధికారులు..

పెనుకొండ నవంబర్ 14 ప్రభాతవార్త



కలపను తరలిస్తున్న వాహనం సీజ్ చేస్తున్న అటవీశాఖ అధికారులు

నియోజకవర్గం పరిధిలోని రొద్దం మండలం, తురకలాపట్నం చెరువు వద్ద అక్రమంగా తుమ్మ చెట్లను నరికి కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు శనివారం సీజ్ చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.శ్రీసత్యసాయి జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి సూచనలు పెనుకొండ అటవీక్షేత్రాధికారి జె.మదన్ మోహన్ ఆదేశాల మేరకు, అటవీ సెక్షన్ అధికారి కె.రాహుల్ అటవీ బీట్ అధికారి శ్రీకాంత్ లు సంఘటనా స్థలానికి చేరుకుని, అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం అటవీ కార్యాలయానికి తరలించారు.ఈ అక్రమ కలప రవాణా వ్యవహారంలో నిందితుడిగా దాల్ రెడ్డి నీ గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ, అటవీ సంపదను అక్రమంగా నరికివేయడం, కలపను అక్రమంగా రవాణా చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టవిరుద్ధ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

నేడు క్రికెట్, సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

- ఎఫ్‌జిఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ

అనంతపురం సిటీ, నవంబర్ 14 ప్రభాతవార్త

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో భాగంగా ఆదివారం క్రికెట్ సాఫ్ట్ బాల్ జట్ల ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని ఎఫ్‌జిఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టిటి క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 బాలుర క్రికెట్ జట్లు ఎంపికలు జరుగుతుందన్నారు. అండర్-14, 17, 18, 19, సాఫ్ట్, టెన్నిస్ జిల్లా జట్లను నగరంలోని లక్ష్మినరసింహా టెన్నిస్ అకాడమిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రతి పిఈటి తమ తమ పాఠశాలల నుండి కేవలం ముగ్గురు క్రీడాకారులను మాత్రమే జిల్లా జట్టు ఎంపికకు తీసుకురావాలని ఆయన సూచించారు.

జాతీయ బాలల దినోత్సవం రోజు విషాదం..!

- జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో 10వ తరగతి విద్యార్థి మృతి - చిన్నముష్టూరు సమీపంలో 3 ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ప్రమాదం - ప్రమాదంలో మరో ఐదుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి ఆందోళనకరం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 10వ తరగతి విద్యార్థి ఈశ్వర్ ,ఈశ్వర్ (ఫైల్‌ఫోటో) ,తీవ్రంగా గాయపడిన కొట్టాలపల్లికు చెందిన ప్రసన్నకుమార్



ప్రమాదంలో గాయపడిన 10వ తరగతి విద్యార్థులు హరీష్, హేమంత్

గాయపడిన ప్రసన్నకుమార్ భార్య లక్ష్మి గాయపడిన పీసీ ప్యాపిలికి చెందిన జమీలా

ఉరవకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామ సమీపంలో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో శనివారం ఉదయం 3 ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10వ తరగతి చదువుతున్న ఈశ్వర్ (16) అనే విద్యార్థి మృతి చెందాడు. ప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తున్న మరోఐదుగురికి గాయాలుకాగా ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లుతెలుస్తోంది. పోలీసులు, బాధితుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే... ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన హరీష్, గుంతకల్లు మండలం దోనిముక్కలకు చెందిన ఈశ్వర్, హేమంత్ అనే ముగ్గురు స్నేహితులు గుంతకల్లులోని విజ్ఞాన జ్యోతి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. రెండో శనివారం, బాలల దినోత్సవం సెలవు కావడంతో ముగ్గురూ కలిసి ఉదయం సరదాగా ద్విచక్రవాహనంలో పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామిను దర్శించుకొని తిరిగి గుంతకల్లు వెళుతూ చిన్నముష్టూరు గ్రామంపద్ద మందు వెళుతున్న పీసీ ప్యాపిలికి మరొక ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ముగ్గురు విద్యార్థులతోపాటు పీసీప్యాపిలికి చెందిన భార్యా భర్తలు జమీలా, వలీ గాయపడ్డారు. ఈక్రమంలోనే అనంతపురం వైపునకు వెళుతున్న విడపనకల్లు మండలం పి.కొట్టాలపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు ప్రసన్నకుమార్,లక్ష్మి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం కూడా ఈ వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదానికి గురికాగా వారూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఈశ్వర్ చికిత్స పొందుతూ మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ప్రసన్నకుమార్‌ను వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. కాగా ప్రమాదంలో మృతి చెందిన 10వ తరగతి విద్యార్థి ఈశ్వర్ తండ్రి కళ్యాణ్‌బాబు ఏడాది క్రితం చనిపోగా తల్లి లలితమ్మ, సోదరుడు చోటు ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే వ్యవసాయ కూలీ అయిన తల్లి, సోదరుడు బంధువులతోపాటు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఇక మాకు దిక్కెవరని బోరున విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ బియ్యం కోసం జనం బారులు.. పంపిణీలో గందరగోళం..!

- 50 ప్యాకెట్లే నిల్వ ఉండటంతో వినియోగదారుల అవస్థలు - సోమవారం నుంచి అందరికీ అందేలా చర్యలు సీఎస్‌డీటీ రమణబాబు



ధర్మవరం రైతుబజార్‌లో ధరణి బియ్యం కోసం జనం క్యూ

ధర్మవరం రూరల్ నవంబర్ 14 ప్రభాతవార్త

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు తగ్గడం, బయట మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా పలుకుతుండటంతో రాయితీ ధరణి బియ్యానికి డిమాండ్ పెరిగింది. దీంతో ధర్మవరం రైతుబజార్ కేంద్రానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. అయితే ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచాలని వినియోగదారులు కోరుతున్నారు. సరిపడా నిల్వలు లేకుండా విక్రయాలు చేపడితే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి క్రమబద్ధంగా బియ్యం పంపిణీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ధర్మవరం రైతుబజార్‌లో మొత్తం 448 బస్తాల బియ్యాన్ని విక్రయానికి సిద్ధం చేశారు. ఒక్కో బస్తాలో 26 కిలోల చొప్పున మొత్తం 11,648 కిలోల బియ్యం నిల్వ ఉంచారు. 26 కిలోల బస్తా ధరను రూ.1,300గా నిర్ణయించారు. శుక్రవారం మొత్తం 448 ప్యాకెట్లను పంపిణీ చేశారు. ధరణి ఏజెన్సీ వారు శనివారం కేవలం 50 ప్యాకెట్ల బియ్యం మాత్రమే నిల్వ ఉంచడంతో కొనుగోలు కోసం వచ్చిన ప్రజలందరికీ బియ్యం అందించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వినియోగదారులు పెద్ద సంఖ్యలో రావడంతో కేంద్రం షట్టర్ మూసివేయాల్సి వచ్చింది. బియ్యం కోసం వచ్చిన మహిళలు క్యూలో ఉక్కిరిబిక్కిరయ్యారు. తోపులాటలు చోటుచేసుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీఎస్‌డీటీ రమణబాబు వివరణ : మొదటి రోజు 448 బస్తాలను పంపిణీ చేసాము.ధరణి బియ్యం కోసం ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 50 ప్యాకెట్లను కూడా వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకున్నామని సీఎస్‌డీటీ ఇన్‌చార్జి రమణబాబు తెలిపారు. సోమవారం నుంచి అందరికీ బియ్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆయన వివరించారు.

సత్తా చాటిన ఏడు బాల శాస్త్రవేత్తల బృందాలు

- అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి జాతీయ బాలల విజ్ఞాన సదస్సుకు ఏడు ప్రాజెక్టుల ఎంపిక
- స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపిన విద్యార్థులు - విద్యార్థులు, మార్గదర్శక ఉపాధ్యాయులకు డీఈఓ అభినందనలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త



32వ జాతీయ బాలల విజ్ఞాన సదస్సు (32వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్-2026) జిల్లా స్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మొత్తం 105 విద్యార్థుల బృందాలు తమ పరిశోధన ప్రాజెక్టులను ప్రదర్శించగా, వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్‌టెక్నాలజీ కౌన్సిల్,పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా సైన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి జాతీయ బాలల విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ ఏడాది ఖిసుస్థిరత కోసం సైన్స్ మరియు ఆవిష్కరణలుఖి అనే ప్రధానఇతివృత్తంతో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 105 బాల శాస్త్రవేత్తల బృందాలు తమ మార్గదర్శక ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పరిశోధన ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించాయి. పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల వినియోగం, స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు వంటి అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి నియమించిన న్యాయనిర్ణేతల బృందంలో ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ చంద్రశేఖర్, వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ శశికిరణ్‌పాల్గొన్నారు. వీరువిద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి శాస్త్రీయత,సృజనాత్మకత,ఆచరణసాధ్యత తదితర అంశాలనుసమీక్షించారు. అనంతరం మొత్తం ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలు:

ఎన్. విమల్ - జెడ్.పి.హెచ్.ఎస్, పులకుంట. గైడ్‌టీచర్ సారాసుజన్, పి.నవాజ్ - జెడ్.పి.హెచ్.ఎస్, హనకనహాల్. గైడ్ టీచర్ ఎం. ప్రసాద్, సి. వైష్ణవి - జి.జి.హెచ్.ఎస్, నార్పల. గైడ్ టీచర్ ఎన్. శాంసన్ సుమా కిరణ్, యు. కౌషర్ - జెడ్.పి.హెచ్.ఎస్, ఫోర్ట్ గుత్తి. గైడ్ టీచర్‌డి.వసంతరాణి, ఎ.హాసిని - ఏ.పి.ఎం.ఎస్, పుట్లూరు. గైడ్ టీచర్ బి.రాధిక, టి. లక్ష్మీచౌదరి - మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్. గైడ్ టీచర్: డి. ఫయాజ్. ఆర్. జూశిత - ఏ.పి.ఎస్.డబ్ల్యూ. ఆర్.ఎస్, కురుగుంట. గైడ్ టీచర్ కె. నాగలలిత.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు ప్రోత్సాహం:

ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటికి శాస్త్రీయ దృక్పథంతో ఆచరణాత్మక పరిష్కారాలను చూపినతీరు అభినందనీయమన్నారు.చిన్నవయస్సులోనే పరిశోధనాత్మక ఆలోచనలు అలవర్చుకోవడం భవిష్యత్తులో శాస్త్ర,సాంకేతికరంగాల్లో నూతన ఆవిష్కరణలకుదోహదపడుతుందనిపేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు తమ ప్రాజెక్టులను మరింత సమగ్రంగా అభివృద్ధి చేసి మెరుగైన ప్రదర్శనకు సిద్ధం కావాలని సూచించారు.

విజేతలకు డీఈఓ అభినందనలు:

జిల్లా స్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అయ్యూబ్ హుస్సేన్ అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి విజ్ఞాన సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు, గైడ్ టీచర్లకు తగిన సందర్భంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సమన్వయకర్త ఆనందభాస్కర రెడ్డి, జిల్లా విద్యా సమన్వయకర్త మేడా ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాలమురళీకృష్ణ సమన్వయంతో నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఏడు ప్రాజెక్టులు త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జాతీయ బాలల విజ్ఞాన సదస్సులో పాల్గొననున్నాయి. రాష్ట్రస్థాయిలో కూడా అనంతపురం జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యాశాఖ అధికారులు ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుల వినతులకు ఇకపై నిర్దేశిత మార్గమే!

- నేరుగా పాఠశాల విద్యాశాఖకు పంపితే చర్యలు తీసుకోరు - జిల్లా స్థాయిలో పరిశీలన, ధ్రువీకరణ తప్పనిసరి - నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 14 ప్రభాతవార్త



ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత సమస్యలు, విజ్ఞప్తులు, వినతిపత్రాలు, అప్పీళ్లను సమర్పించే విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ఉపాధ్యాయులు తమ అభ్యర్థనలను నిర్దేశించిన అధికారిక మార్గం ద్వారానే సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మెమో నంబర్ ఈఎస్ఈ0214/216/2026 ఈవిఐ2, తేదీ 10 112026 ద్వారా రాష్ట్రంలోని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు,జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయుల నుంచి వస్తున్న వ్యక్తిగత అభ్యర్థనలు, వినతిపత్రాలు, అప్పీళ్లు కొందరు నేరుగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపుతున్నట్లు శాఖ దృష్టికి వచ్చింది. ఈ విధంగా వచ్చిన దరఖాస్తులు సంబంధిత జిల్లా స్థాయి అధికారుల పరిశీలన లేకుండా నేరుగా కార్యాలయానికి చేరుతున్నాయని పేర్కొంది. దీనివల్ల నిబంధనల ప్రకారం పరిశీలన, ధ్రువీకరణ జరగకపోవడంతోపాటు సంబంధిత అధికారుల స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలు కూడా రాష్ట్రస్థాయికి వస్తున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రతి ఉపాధ్యాయుడి నుంచి వచ్చే వినతులు, అభ్యర్థనలు, అప్పీళ్లను ముందుగా సంబంధిత అధికారుల స్థాయిలోనే క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించింది. ఆయా అంశాలకు వర్తించే నిబంధనలు, ప్రభుత్వ సూచనలు, ఉత్తర్వులను పరిశీలించి, వాస్తవాలను ధ్రువీకరించిన తర్వాతే తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

జిల్లా స్థాయిలో పరిశీలన తప్పనిసరి:

ఉపాధ్యాయులు సమర్పించే ఏ ఒక్క వినతిపత్రాన్ని కూడా సరైన పరిశీలన, ధ్రువీకరణ లేకుండా రాష్ట్ర కార్యాలయానికి పంపకూడదని ఆదేశాల్లో పేర్కొంది. సంబంధిత ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అభ్యర్థనలను పరిశీలించి, పరిష్కరించాల్సిన అంశాలపై తమ స్థాయిలోనే తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

రాష్ట్రస్థాయి వివరణలు కూడా నిర్దేశిత మార్గంలోనే:

ఏదైనా అంశంపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి వివరణ లేదా మార్గదర్శకాలు అవసరమైతే, సంబంధిత ప్రతిపాదనలను ఈఆఫీస్ ద్వారా నిర్దేశిత అధికారిక మార్గంలోనే పంపాలని స్పష్టం చేసింది. అలా పంపే ప్రతిపాదనలకు సంబంధిత నిబంధనల వివరాలు, అధికారుల స్పష్టమైన అభిప్రాయాలు, సిఫార్సులు, అవసరమైన ఆధార పత్రాలను తప్పనిసరిగా జతచేయాలని ఆదేశించింది.

క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు:

ఈ ఉత్తర్వులను తమ పరిధిలోని క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించింది. ఉపాధ్యాయులకు కూడా నిర్దేశిత విధానంపై అవగాహన కల్పించాలని, ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని సూచించింది.

ఉల్లంఘిస్తే చర్యలు:

వినతులు, అభ్యర్థనలు, అప్పీళ్ల సమర్పణలో నిర్దేశించిన విధానాన్ని పాటించకపోతే, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు ప్రారంభిస్తామని ఉత్తర్వుల్లో హెచ్చరించింది. పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు (సర్వీసెస్) ఏ. సుబ్బారెడ్డి ఈ మెమోపై సంతకం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. దీనిపై అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎన్. అయూబ్ హుస్సేన్ ను వివరణ అడగగా... ఉపాధ్యాయుల సమస్యలు ఉంటే మొదట జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేయాలని, నేరుగా రాష్ట్ర కార్యాలయంలో అందజేయకూడదని రాష్ట్ర ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాలను జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ పాటించాలి.